క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

లేపాక్షి: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం 1978 – 1981(నాలుగు బ్యాచ్‌లు)కు చెందిన పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. లేపాక్షిలోని నీలం సంజీవరెడ్డి ఓరియంట్ పాఠశాల, చింతల పాటి బాపిరాజు ప్రాచ్య కళాశాలలో కూడా చదివిన విద్యార్థులు సుమారు 40 మంది కలిసి అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం పూర్వ విద్యార్థురు దుర్గాదేవి, వీరభద్రస్వాములను దర్శించుకున్నారు.

వైభవంగా హనుమజ్జయంతి

హిందూపురం: పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం హనుమద్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోట ఆంజనేయస్వామి, సూగురు ఆంజనేయ స్వామి ఆలయాల్లో మూలవిరాట్లను ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు చేసి ప్రాకారోత్సవం జరిపారు. పట్టణంలోని పేట వెంకటరమణస్వామి ఆలయంలో మూలవిరాట్ వెంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేషంగా బంగారు అభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు చేపట్టారు. అలాగే శ్రీదేవి భూదేవి సమేత వెంకటరమణస్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు.

పావగడ: పట్టణంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కోటి ఆంజనేయస్వామి దేవాలయంలో కొలువుదీరిన ఏకశిల ఆంజనేయస్వామికి పూజలు చేశారు. అలాగే స్థానిక కొత్త బస్టాండులో ఆంజనేయస్వామి భక్త మండలి ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం బెల్లం పానకం, పెసర బేడల ప్రసాదాన్ని ప్రయాణికులకు పంపిణీ చేశారు.

డ్రిప్ పరికరాల అపహరణ



డ్రిప్ పరికరాలు చోరీ అయిన పొలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రొద్దం: చోళేమర్రి పంచాయతీ గొబ్బరంపల్లికి చెందిన చిలకల తిమ్మయ్య పొలంలో రెండున్నర ఎకరాల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ పరాకరాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. దాదాపు రూ. 50 వేలు నష్టపోయినట్లు తెలిపాడు. బాధిత రైతు పొలాన్ని ఎంపీటీసీ సదాశివరెడ్డి, నాయకులు ఎన్.నారాయణరెడ్డి, రామాంజనేయులు, మల్లికార్జున, రమేష్ తదితరులు శనివారం పరిశీలించారు.

ఉపకరణాల పంపిణీ

పెనుకొండ: పట్టణంలోని భవిత కేంద్రంలో శనివారం ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేసిన వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, సీపీ చైర్లు , బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లు శనివారం అందజేశారు. ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్, హెచ్ఎం రాధామణి, వెంకటరామిరెడ్డి, వలీబా పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మడకశిరరూరల్: జమ్మానిపల్లిలో లక్ష్మీ నిడిమామిడమ్మ దేవి ఆలయ 38వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం పురోహితులు చండీ హోమం, కలశ అర్చన మూల విగ్రహానికి పంచమృతాభిషేకం, ఉద్వాసన మహాకుంభాభిషేకం తదితర పూజలు చేపట్టారు. మహిళలు జ్యోతులను ఊరేగించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సజ్జగంట రంగనాథస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లిలో వెలసిన సజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం శనివారం వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి రథాన్ని భక్తులు లాగారు. రంగనాథ స్వామి నామస్మరణతో గ్రామం మార్మోగింది. ఆలయ ధర్మకర్త రమాకాంత్ రెడ్డి పూజలు పర్యవేక్షించారు. ఆదివారం దీపోత్సవం కొనసాగనుంది.

సాగని 'స్మార్ట్ సిటీ' పనులు

- ఫెన్సింగ్‌తో ఆపేసిన అహుడా
- స్థలం క్లీనింగ్ సైతం చేయని వైనం
- డిపాజిట్లు, కంతులు చెల్లించి ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

పెనుకొండ: జగనన్న స్మార్ట్ సిటీ వస్తే ఈ ప్రాంతం సుందరంగా రూపుదిద్దుకుంటుందని పెనుకొండ ప్రాంత వాసులు ఎంతో సంబరపడ్డారు. స్థానిక మెడికల్ కళాశాల ఎదురుగా స్మార్ట్ సిటీ నిర్మిస్తే ఈ ప్రాంతానికి మరింత గుర్తింపు వస్తుందనుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఎక్కడి పనులు అక్కడే అన్నట్లు ఆగిపోయాయి. ఎప్పటికి పనులు ప్రారంభమవుతాయోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పెనుకొండ పట్టణానికి అనుకుని ఉన్న షీపారం భూమిలో సర్వేనెంబర్ 1031లో రికార్డు పరంగా 40 ఎకరాలకు పైగా అహుడా స్మార్ట్ సిటీ కోసం తీసుకున్నారు. ప్రస్తుతం 27.04 ఎకరాల భూమిని అధికారులు స్మార్ట్ సిటీ కోసం



స్మార్ట్ సిటీ కోసం కేటాయించిన స్థలం ఇదే

కేటాయించారు. ఇందులో మూడు విభాగాలు నిర్ణయించారు. 5 సెంట్లు, 4 సెంట్లు, 3 సెంట్లు ప్లాట్లుగా నిర్ధారించారు. అహుడా ఆధ్వర్యంలో జరిగే ప్రతి ప్లాట్ కేటాయింపు లాటరీ సిస్టంలో ఉంటుంది. 5 సెంట్లు కావాలనుకున్న లబ్ధిదారుడు ఫీజు రూపంలో రూ.1.20 లక్షలు డిపాజిట్ ప్రభుత్వ అక్కౌంట్‌కు జమ చేశారు. అనంతరం 4 సెంట్లు ప్లాట్లు కావాల్సిన వారు రూ. 90 వేలు ప్రభుత్వ అక్కౌంట్‌కు చెల్లించారు. ఇక 3 సెంట్ల స్థలం కావాల్సిన వారు రూ.70 వేలు ప్రభుత్వానికి చెల్లించాలి. ఇప్పటి వరకు దాదాపుగా 299 ప్లాట్లు ఉంటే ప్రతి ప్లాట్ బుక్ అయ్యింది. రూ.కోట్లు అహుడాకు జమ అయ్యింది. అయినా స్మార్ట్ సిటీ స్థలం కొండ గుట్టలతో నిండి ఉంది. దాన్ని కనీసం చదును చేయించలేదు. ప్లాట్లు కేటాయించారుగానీ డబ్బులు చెల్లించిన వారికి ప్లాట్లు ఎక్కడో చూపించలేదు.

పట్టించుకోని అధికారులు..

అహుడా అధికారుల చేతుల్లోకి జగన్న లేఅవుట్ వెళ్లడంతో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మేము స్థలం ఎప్పుడు సిద్ధం చేస్తే అపుడు తీసుకోండి అనే ధోరణిలో పట్టించుకోవడంలేదు. 27.04 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ వేసి, ముఖం చాటేశారు. డిపాజిట్‌తో పాటు పలువురు నెలవారీ కంతులు చెల్లించారు. వారిలో భయాందోళన మొదలైంది. ఈ స్మార్ట్ సిటీ సిద్ధం అయితే పెనుకొండ ఒక రేంజ్‌లో ఉంటుందని భావిస్తున్నారు. అయితే అధికారులు నిర్లక్ష్యం వీడి, త్వరలో స్మార్ట్ సిటీ ఏర్పాటుకు ఎలాంటి చర్యలు చేడుతారో చూడాలి.

అంతా అహుడానే

జగనన్న స్మార్ట్ విషయం అంతా అహుడాదే. ఇందులో నగర పంచాయితీది ఎలాంటి సంబంధం లేదు. ప్లాట్లు అన్నీ సిద్ధమయ్యాక నగర పంచాయిత నిబంధనల ప్రకారం అన్ని షరతులు వర్తిస్తాయి.

– సతీష్‌కుమార్, కమిషనర్, పెనుకొండ నగర పంచాయతీ

కంతులు చెల్లిస్తున్నా..

ప్రభుత్వ షరతుల ప్రకారం డిపాజిట్‌లు, కంతులు చెల్లిస్తున్నాను. స్థలం శుభ్రం చేసి ప్లాట్లు విభజించాలి. అధికారులు త్వరితగతిన స్థలం క్లీన్ చేసి ప్లాట్లు వేస్తే పెనుకొండ పట్టణంలో ఎంతో అభివృద్ధి సాధిస్తుంది. కేవలం చుట్టూ కంచె వేస్తే సరిపోదు. వంటనే తగిన చర్యలు చేపట్టాలి. వందలాది మంది ఇబ్బంది పడుతున్నారు.

– రామాంజనేయులు, మోట్రువల్లి, పెనుకొండ

త్వరలో పూర్తి చేస్తాం

పెనుకొండ పట్టణంలో అన్ని పనులు త్వరలో పూర్తి చేసి ప్లాట్లు విభజిస్తాం. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉంది. మొత్తం 50 ఎకరాల్లో విస్తరిస్తాం. ఇప్పటి వరకు 27 ఎకరాల్లో పనులు జరిగాయి. 50 ఎకరాలు దాటుతుంది. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకే పనులు జరుగుతాయి.

– ఇషాక్, ప్లానింగ్ ఆఫీసర్, అహుడా, అనంతపురం

సాక్షి పాత్రికేయులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

హిందూపురం టౌన్: సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డితో పాటు ఆరుగురు జర్నలిస్టులపై కూటమి సర్కార్ పెట్టిన కేసులను ఎత్తి వేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. హిందూపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు పట్టణంలో శనివారం నల్లరిబ్బన్లు కట్టుకుని ర్యాలీ చేపట్టారు. ప్రెస్‌క్లబ్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకూ ర్యాలీగా చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జే.ప్రకాష్, హిందూపురం ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, సీనియర్ జర్నలిస్టు నాగరాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్ మాట్లాడుతూ సాక్షి ఎడిటర్‌తో పాటు ఆరుగురు జర్నలిస్టులపై అక్రమంగా కేసులు బనాయించడాన్ని ఖండించారు. కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని



అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శ్రీధర్ రెడ్డి, ప్రకాష్, రాజేష్, సురేష్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, గంగప్ప, అల్లీపీరా, శివకుమార్, జగదీష్, గిరీష్, గోపాల్, గంగయ్య, శ్రీకాంత్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

హిందూపురం: స్థానిక ఎంజీఎం ఉన్నతపాఠశాల ఆవరణలో శనివారం ట్రీనిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషా రాణి, బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి బృందం సంయుక్తంగా ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. 550 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో 180 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. ఎంపికైన వారికి బెంగళూరు శంకర కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ కార్యకర్తలకు బూతులు నేర్పుతున్నారా?

- ఎమ్మెల్యే బాలకృష్ణకు వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి సూటి ప్రశ్న
- మాజీ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

చిలమత్తూరు: తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు విచక్షణ మరచి బూతులు మాట్లాడే సంస్కృతి నేర్పుస్తున్నారా అని వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి ఎమ్మెల్యే బాలకృష్ణను సూటిగా ప్రశ్నించారు. హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన మోహన్ అనే టీడీపీ కార్యకర్త మాజీ సీఎం వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియో విడుదల చేశారు. సదరు కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని వేణురెడ్డి శనివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజగోపాల్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. అత్యంత జనాదరణ కలిగిన వైఎస్ జగన్‌పైనే ఇష్టమొచ్చినట్లు వ్యాఖ్యలు, అభ్యంతరకర పోస్టులు పెట్టడం చూస్తుంటే టీడీపీ కార్యకర్తలను ఎలా తయారు చేస్తున్నారో ప్రజలందరూ గమనించాలని కోరారు. ప్రశాంతంగా



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి, తదితరులు

ఉన్న నియోజకవర్గంలో రెచ్చగొట్టే వీడియోలు తీసి అల్లర్లు సృష్టించాలని టీడీపీ నాయకులు చూస్తున్నారన్నారు. రాజకీయ విమర్శలు చేస్తే స్వీకరిస్తామని.. వ్యక్తిత్వ హననాలకు పాల్పడితే సహించేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ శివ, మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఆసీపుల్లా, కౌన్సిలర్లు నాగేంద్రబాబు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్ గౌడ్, వైఎస్సార్‌సీపీ నేతలు లోకేష్, చంద్రశేఖర్‌రెడ్డి, తిప్పేరుద్రయ్య, రామకృష్ణారెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

ఇంటర్‌లో గురుకుల కళాశాల విద్యార్థుల ప్రతిభ



గంగోత్రి 436



శ్రీశాంత్(959)



పవన్‌కుమార్(921)



బి.శిరీషా(900)



సౌజన్య, రొద్దం



గీతిక, రొద్దం



హరిత, కల్లుకుంట



రజని, ఆర్.కొట్టాల



వి.ఐసు 429



కె.కాంచన 456

లేపాక్షి: ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో లేపాక్షిలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల సెకండియర్‌లో విద్యార్థులు 99 శాతం(125 మందికిగాను 124 మంది) ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఫస్టియర్‌లో 130 మందికిగాను 109 మంది(84 శాతం) పాసయ్యారు. సెకండియర్ ఎంపీసీ దివాకర్ 984, బైపీసీలో జి.శ్రీశాంత్ 959, ఎంఈసీ గ్రూపులో హెచ్.ఆంజనేయులు 813, సీఈసీ గ్రూపులో ఎం.పవన్‌కుమార్ 921 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సుందరరాజు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో 73 మందికి గాను 21 మంది, సెకండియర్‌లో 50 మంది విదార్థులకు గాను 39 మంది విద్యార్థులు(78 శాతం) ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ మహాబూబ్‌బాషా తెలిపారు. కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఫస్టియర్‌లో 37 మంది విద్యార్థులకు 29 మంది(79 శాతం), సెకండియర్‌లో 24 మందికిగాను 24 మంది(వంద శాతం) ఉత్తీర్ణ సాధించినట్లు స్పెషల్ ఆఫీసరర్ నీలిమా తెలిపారు.

జూనియర్ కళాశాల విద్యార్థులు 59 శాతం ఉత్తీర్ణత

రొద్దం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 59 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సం ఫలితాల్లో 64 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 38 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో 94 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 30 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో బూచర్లకు చెందిన సౌజన్య బైపీసీ 1000 మార్కులకు గాను 929 మార్కులు సాధించింది. రొద్దం గీతిక బైపీసీ 1000 మార్కులకు గాను 902 సాధించింది, కల్లుకుంట హరిత హెచ్ఈసీలో 1000 మార్కులకు 792 మార్కులు సాధించారు. ఆర్ కొట్టాలకు చెందిన రజిని హెచ్ఈసీలో 788 మార్కులతో ఉత్తీర్ణత పొందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో సత్యసాయి కళాశాల ప్రతిభ

పెనుకొండ: ఇంటర్ పరీక్షల్లో పట్టణానికి చెందిన శ్రీసత్యసాయి కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్సరంలో 119 మంది పరీక్షకు హాజరుకాగా 70 శాతంతో 83 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ ఇంటర్‌లో 146 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 71 శాతంతో 103 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సెకెండ్ సీఈసీలో అఖిల శౌర్య 1000 మార్కులకు 952, సెకెండ్ ఎంపీసీలో అఫ్రిన్‌తాజ్ 936, బైపీసీలో అర్జుమన్ భాను 927, సాదియా 914 మార్కులు సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ గంగాధర్, ఏఓ కేశవయ్య అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో ఏపీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీ విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ కనపరిచారు. ద్వితీయ ఇంటర్‌లో 124 మందికిగానూ 119 మంది, ప్రథమ సంవత్సరంలో 124 మందిలో 109 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ జలజ తెలిపారు. రెండో సంవత్సరం ఎంపీసీ విద్యార్థి మంజునాథ్ 977 మార్కులు, బైపీసీలో మహమ్మద్ రఫీ 976, ఎంఈసీలో మహేష్, సీఈసీలో నందివర్ధన్ 944 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఫస్టీయర్‌లో కృష్ణ (ఎంపీసీ) 461, మహేష్ (బైపీసీ) 427, హరీష్ (ఎంఈసీ)482, కార్తీక్ (సీఈసీ) 478 మార్కులు సాధించారన్నారు.

గుడిబండ: ఎంజేపీ కళాశాల విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో 115 మందికి 115 మంది, ద్వితీయ సంవత్సరంలో 101 మందికి గాను 101 మంది బాలికలు పాసైనట్లు పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో ఎం.జస్విత 979, బైపీసీలో కవితాబాయి 982, సీఈసీలో జాహ్నవి 952 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కాంచన, లలిత 470 మార్కులకు గాను 456 మార్కులు, బైపీసీలో వి.ఐసు 429, సీఈసీలో హారిక 469 మార్కులు సాధించారు.

గుండమల కేజీబీవీలో..

మడకశిరరూరల్: గుండుమల కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ మెదటి సంవత్సరంలో 25 మంది విద్యార్థులకు గాను 16 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 25 మంది గాను 24 మంది ఉత్తీర్ణత సాధించారని పాఠశాల సిబ్బంది తెలిపారు.

రొళ్ల: ఆవినకుంట గ్రామం వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.మున్వార్‌జాన్ తెలిపారు. బైపీసీ గ్రూప్‌లో హెచ్.స్వప్న 944, ఆర్.రక్షిత 943 మార్కులు, సి.శశికళ 940, జూనియర్ ఇంటర్ బైపీసీలో హెచ్.హేమలత 416 మార్కులు సాధించారు.

అమరాపురం: మండలంలోని హులుకూరు సమీపంలో వున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. సీనియర్ ఇంటర్‌లో 62 మంది పరీక్షలు రాయగా 61 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో డి.సుప్రియ 971, బైపీసీలో వర్ష 945 సాధించారు. జూనియర్ ఎంపీసీలో నవ్య, అర్పన విజయ్ 460 మార్కులు సాధించారు. బైపీసీలో గౌతమి 424 మార్కులు సాధించింది. జూనియర్ ఇంటర్‌లో మొత్తం 78 మంది పరీక్షలు రాయగా 73 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు.

ఏపీ మోడల్ పాఠశాలలో

ఏపి మోడల్ పాఠశాలలో జూనియర్ ఇంటర్‌లో 83 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 75 మంది ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో మొత్తం 90 మంది పరీక్షలకు హాజరు కాగా.. 82 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ ఓబలపతి తెలిపారు. సీనియర్ ఎంపీసీలో అంకిత 949, జూనియర్ ఎంపీసీలో రక్షిత 442, జూనియర్ బైపీసీలో గంగోత్రి 436 మార్కులు సాధించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో 104 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 78 మంది ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 70 మంది పరీక్షలు రాయగా 63 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ నాయక్ తెలిపారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో సంగీత 966, బైపీసీలో అక్షయ 966, జూనియర్ ఎంపీసీలో కీర్తన 456, బైపీసీ విభాగంలో 421 మార్కులు సాధించారు.

అగళి: మండంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో శిల్ప 475, కల్పనశ్రీ 469, కవిత 450 మార్కులు సాధించారు.

ద్వితీయ సంవత్సరంలో ఎం.కావ్య 925, సీ.వర్ష 909 మార్కులు సాధించారని ఎస్ ఓ నాగరత్నమ్మ తెలిపారు.

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సర విద్యార్థులు 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరలో 178 మంది పరీక్షలు రాయగా.. 59 మంది మాత్రమే పాసయ్యారు. బైపీసీలో ప్రేమ 950, సీఈసీలో పుష్ప 912 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 63 శాతం,ప్రథమ సంవత్సరంలో 43 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

గోరంట్ల: ఇంటర్ ఫలితాల్లో మండలంలోని కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ సాధించారు. మౌనిక అనే విద్యార్థిని సీఈసీలో 1000 మార్కులకు గాను 916, శ్రీవల్లి అనే విద్యార్థిని 1000 మార్కులకు గాను 908 మార్కులు సాధించింది. లోకేశ్వరీ బాయి మొదటి సంవత్సరం సీఈసీ 467 మార్కులు, నివేదిత అనే విద్యార్థిని 477 మార్కులు సాధించింది.

పెనుకొండ: పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. శనివారం విడుదలయిన మొదటి సంవత్సరం ఫలితాల్లో 156 మందిలో 51 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో 172 మందికి 79 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్‌లో 105 మందికి 53 మంది పాస్ ఉత్తీర్ణత కాగా, వొకేషనల్‌లో 124 మందికి 100 మంది పాసయినట్లు ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు.

'సువర్ణ భారతి' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సువర్ణభారతి అధ్యాపక బృందం

హిందూపురం టౌన్: పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శనివారం కళాశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల చైర్మన్ నీలకంఠ రెడ్డి, కార్యదర్శి అనిల్‌కుమార్, రవీంద్రారెడ్డిలు అభినందించారు. ఫస్టియర్ ఎంపీసీలో జీ.అనుష 464, పి.రుతిక 463, బైపీసీలో బి.అక్షిత 435, బి.శైలజ 433, సీఈసీలో కేఎన్ చందన 487, ఏ.నిత్య మహాలస 483, ఎంఈసీ కేపీ జయంతి 469, వి.మహిమ 465 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో అమూల్య 987, నిహారిక 987, రామ్ చరణ్ 985, బైపీసీలో ఎస్.చంద్రకళ 982, ఎంఈసీలో మైత్రి 974 మార్కులు సాధించారు.

సత్తాచాటిన 'ఎఆర్‌జీ' విద్యార్థులు

ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో కేఎస్ చందన ప్రియ 990, సీ.రంగస్వామి 988, సాయి ప్రణతి 988, బైపీసీలో ఆర్.తనుషా 987, ఎంఈసీలో ఎస్ఎస్ వికాస్ 977, సీఈసీలో ఎన్.అశ్విని 976 మార్కులు, ఫస్టియర్ ఎంపీసీలో కే.మనోజ్ 462 , బైపీసీలో వి.చంద్ర చేతన 436, ఎంఈసీలో శ్రీసాయి దర్శిని 489, సీఈసీలో అంజుమ్ నిఖత్ 485 మార్కులు సాధించినట్లు ఎఆర్‌జీ నాయుడు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి తెలిపారు.

మెరిసిన 'బాలయేసు' విద్యార్థులు

ఇంటర్ ఫలితాల్లో బాలయేసు కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్ బలరామిరెడ్డి, ప్రిన్సిపాల్ సౌరిరెడ్డి, కరస్పాండెంట్ బాలప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎంపీసీలో బీ.షీమా సాదియి 988, ఎస్.ప్రహర్ష 983, బైపీసీలో శ్రీలాస్య 946, జ్యోతి డోరిస్ 930, సీఈసీలో డి.డింపుల్ 937 మార్కులు, ఫస్టియర్ ఎంపీసీలో ఎస్.హేమ 462 యం.శ్రావణి 459, సి.యశ్విని 457, బైపీసీలో జి.అముల్య 419, సాయి చందన 414, సీఈసీలో ఆర్.రాణి 468, బి.భాస్కర్ 453, ఎంఈసీలో సి.గ్రంధ హారిక 471 మార్కులు సాధించారన్నారు.

ఇస్రో టూర్‌కు ఎంపిక



కావ్య



చరణ్

మడకశిరరూరల్: ఇన్‌స్పైర్ మనాక్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చెందువుతున్న కావ్య, చరణ్ ఇస్రోటూర్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం రంగస్వామి తెలిపారు. శనివారం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు మారుతి కుమార్, వెంకట ప్రసాద్, సూర్య ప్రకాష్‌ను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



గాయపడిన మహిళ

అగళి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం మధుగిరి తాలుకా బర్మ దేవరపల్లికి చెందిన గోవిందప్ప తల్లి పాపక్కతో కలసి కసాపురం గ్రామంలోని మామ గోవిందప్ప ఇంటికి వచ్చాడు. శనివారం తిరిగి తన స్వగ్రామనికి బయలుదేరారు. కేజీబీవీ పాఠశాల సమీపంలోకి చేరుకోగానే నరసబుంది గ్రామానికి చెందిన రాఘవేంద్ర ద్విచక్ర వాహనంలో ఢీకొట్టాడు. ఈ ఘటనలో పాపక్క కింద పడటంతో కాళ్లు విరిగాయి. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు కర్ణాటక రాష్ట్రం తుమకూరు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనుకొండ: పట్టణంలోని ఊరు వాకిలి ఆంజనేయస్వామి ఆలయంలో ఏడో నవరాత్రి రోజైన శనివారం పూల వ్యాపారి జయచంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయంలో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో పానకాలు, పెసరపప్పు అందించారు.

అపూర్వ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలలో 1991–92 బ్యాచ్ విద్యార్థులు శనివారం సమ్మేళనం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు నాడు తాము చదువుకున్న సమయంలోని పలు విషయాలను నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఏం చేస్తున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు మంజుల, మునీర్, ప్రకాష్, జహీర్, సిరాజ్, జయా తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో స్కౌట్స్ యూనిట్లు ప్రారంభం

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామం సమీపాన 544ఈ జాతీయ రహదారి పక్కన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో భారత్ స్కౌట్స్ యూనిట్లు ప్రారంభించినట్లు పాఠశాల చైర్మన్ సుమ, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. పీఎంశ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్ రైజింగ్ ఫర్ ఇండియా) స్కీంలో భాగంగా రాష్ట్రంలో మొదటి విడతగా దాదాపు 662 పాఠశాలల్లో భారత్ స్కౌట్స్, గైడ్ కార్యక్రమం ప్రవేశ పెట్టారని పేర్కొన్నారు. సుభాష్ చంద్రబోస్‌కి చంద్రశేఖర్, భగత్ సింగ్‌కి వెంకటనారాయణ స్కౌట్స్ యూనిట్ మాస్టర్లుగా శిక్షణ ఇస్తారన్నారు.

ఉపకరణాల పంపిణీ

గుడిబండ: స్థానిక భవిత కేంద్రంలో శనివారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంత విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా విభిన్న ప్రతిభావంత విద్యార్థులపై శ్రద్ధ వహించాలని సూచించారు.

హెడ్ కానిస్టేబుల్ బైక్‌కు నిప్పు



కాలిపోయిన ద్విచక్రవాహనం

పెనుకొండ: పట్టణానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ మాలతి ద్విచక్రవాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. మాలతికి, ఆమె కుటుంబ సభ్యులకు మధ్య స్థల వివాదం ఉందని, ఈ క్రమంలోనే బైక్‌కు నిప్పు పెట్టి ఉంటారని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టినట్లు చెప్పారు.

మహిళకు పాముకాటు

గోరంట్ల: పట్టణంలోని నాల్గో వార్డుకు చెందిన ఫక్రున్నీ అనే మహిళ పాముకాటుకు గురైంది. శనివారం పాలసముద్రం వద్ద వ్యవసాయ తోటలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం పుట్టపర్తి ఆస్పత్రికి తరలించారు.